
అల్లూరి సీతారామరాజు

ఉద్యానవన సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - పెదబయలు : స్థానిక ఎస్‌అర్‌జియస్ కార్యాలయంలో బుధవారం మండల వ్యవసాయాధికారి అడ్డురి శ్రీనివాస్‌వా ఆధ్వర్యంలో పెదబయలు, ముంచింగిపుట్టు మండలాలకు చెందిన సచివాలయ ఉద్యానవన సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బి ఎస్ నంద్ హాజరై మాట్లాడుతూ, కాఫీ, మిరియాలు, పసుపు పంటల్లో నాణ్యమైన దిగుబడులు రావడానికి పాటించవలసిన పద్ధతులు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫీల్డ్ అధికారి పి.మోహన్, హార్టి కల్చర్ అధికారి డి.జ్యోత్స్న రాణి, పి.పద్మ. కాపి బోర్డ్ అధికారి శ్రీ రాములు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన సిబ్బంది

గిరిజన ప్రాంతాల్లో..

పాఠశాలల విలీన ప్రక్రియను ఆపాలి

- ఎస్‌టి కమిషన్ కు గిరిజన సంఘం ప్రతినిధుల బృందం వినతి


ఎస్‌టి కమిషన్ చైర్మన్ రవిబాబుకు వినతిపత్రం ఇస్తున్న బృంద ప్రతినిధులు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీన ప్రక్రియను ప్రభుత్వం ఉపసంహరణ చేసుకోవాలని కోరుతూ షెడ్యూల్డ్ ట్రైబల్ కమిషన్ ఛైర్మన్ కుంభ రవి బాబుకు గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స ప్రతినిధి బృందం విశాఖలో బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో తక్కువ మంది విద్యార్థులు ఉన్న వాటిని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీన్ని అమలు చేస్తే అల్లూరి జిల్లాలో సుమారు 82 ప్రాథమిక పాఠశాలలు విలీనం జరుగుతుందని, ఫలితంగా సుమారు 900మంది గిరిజన విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరం అవుతారని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో గిరిజన విద్య మరింత అస్థవ్యస్తమవుతుందన్నారు. గిరిజనుల్లో డ్రాప్ అవుట్ తో విద్యాభివృద్ధికి విఘాతం కలుగుతుందన్నారు. ఖాళీగా ఉన్న టీచర్స్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఉపాధ్యాయ కొరత కారణంగా పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్నారన్నారు. టీచర్స్ నిత్యం అందుబాటులో ఉండే కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు 20 మందికిపైన ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయుల కొరత మూలంగానే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిందని, దీనిని ప్రభుత్వం గుర్తించి టీచర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాల విలీన ప్రక్రియను ఉపసంహరణ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యమ సలహా దారులు కె.లోకనాదం, బి.గంగారావు, జగ్గునాయుడు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఎత్తివేతపై ఆందోళన

ప్రజాశక్తి-పాడేరు: మండలంలో వనగుపల్లి పంచాయితీ కనకపుట్టు, గడ్డిబంధలు, బడిమేల పంచాయితీలో వల్లాయి, బర్సింగి పంచాయతీలో గడ్డివలస, గ్రామాలలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలను యధాతథంగా కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎల్.సుందరరావు, గిరిజన సమైక్య మండల కార్యదర్శి.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. తక్కువమంది విద్యార్థులు ఉన్నారని ఈ పాఠశాలలను మూసేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు. బుధవారం కరకపుట్టు పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలల మూసివేతను వ్యతిరేకిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో 50 కుటుంబాలు జీవిస్తున్నాయని ఆరుగురు విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. స్కూల్ ఏత్తేస్తే మూడు కిలో మీటర్ల పరిధిలో ఉన్న మినుములురుకు వెళ్ళవలసి వస్తుందన్నారు. పాఠశాలలు మూసేస్తే వారంతా చదువుకు దూరమై డ్రాపౌట్స్ కావడంతో పాటు నిరక్షరాసులుగా మిగిలి పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య సంస్కరణలో భాగంగా నూతన ఎడ్యుకేషన్ పాలసీ పేరుతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలు మూసేయాలనే నిర్ణయం దుర్మార్గమన్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా 87 పాఠశాలలు ఎతేస్తున్నా ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. మన్యం వాసుల ఓట్లతో గెలుపొందిన ప్రజాప్రతినిధులు పాఠశాలల మూసివేతపై తమ వైఖరి ఎమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు ముడిపెట్టి పాఠశాలలు మూసేయాలని ప్రతిపాదనలు తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరేష్, రమేష్, సూర్యం, రాము, కొండబాబు, కరకపుట్టు, బందపోలం గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు, తల్లిదండ్రులు


అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం అంతాడ గ్రామ సచివాలయం పరిధిలోని తాటివానిపాలెం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయి సర్వం కోల్పోయిన కుటుంబాలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి బుధవారం పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఆ కుటుంబాలకు అత్యవసర వస్తువులు బియ్యం, కూరగాయలు, రూ.10వేలు నగదు, కెసిఎన్ ట్రస్ట్ తరఫున రూ.20వేలు నగుదు అందించారు. నష్టపోయిన కుటుంబాలకు వైయస్సార్ ప్రభుత్వం అండగా ఉంటాదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, చింతపల్లి మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ కొప్పు రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, స్థానిక సర్పంచ్ చంద్రరావు, మండల కన్వీనర్ బండి సుధాకర్ పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: మండలంలోని శీలం గొంది రోడ్డు చంపపట్టి గెడ్డ వద్ద కొట్టుకు పోయిన కాజ్ వేను పున:నిర్మించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గిరిజనులు బుధవారం కాజ్వే వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శాంత కుమారి మాట్లాడుతూ చంపపట్టి కాజ్‌వే హుదూద్ తుపానుకు కొట్టుకు పోయిందన్నారు. ఇప్పటివరకు పున:నిర్మించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే ఫాల్గుణ శంకుస్థాపన చేసి సుమారు ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ నిర్మించ లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ డెలిగేట్ సభ్యుడు పి.చిన్నస్వామి, స్థానిక మండలం ఉపాధ్యక్షుడు బి.సులోచన, ప్రధాన కార్యదర్శి టి.భీమారావు, జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నాయకులు

ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ


ఉదయం వేళలో మంచు

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: మండలంలో గత నాలుగు ఐదు రోజుల నుంచి విభిన్న వాతావరణం ఏర్పడుతుంది. బుధవారం ఉదయం దట్టమైన పొగ మంచు కురియగా, మధ్యాహ్నం తీవ్రమైన ఎండ కాసింది. గత నాలుగైదు రోజుల నుంచి ఇదే వాతావరణం ఇక్కడ నెలకొంటుంది. వేసవికాలం ప్రారంభమైనప్పటికీ శీతాకాలంలో మాదిరిగా తెల్లవారి నుంచి తొమ్మిది గంటల వరకు దట్టమైన పొగ మంచు కురుస్తోంది. పదకొండు గంటల తర్వాత ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.


ఎండతో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు


ఏర్పాట్లుపై స్థానిక పోలీసులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి మహేశ్వర్‌రెడ్డి

జాతరకు బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -మోతుగూడెం

ఈ నెల 27న సోమవారం జరిగే మన్యం కొండ (బడాయాత్ర) జాతరకు బందోబస్తు ఏర్పాట్లను ఎఎస్‌పి కెవి.మహేశ్వర్ రెడ్డి బుధవారం పర్యవేక్షించారు. సీలేరు నది వద్ద అమ్మవారు పడవ దాటే ప్రదేశాన్ని, పొల్లూరులో అమ్మవారు గద్దెల ప్రదేశాన్ని, అమ్మవారికి మంగళ స్నానాలు చేపించే పొల్లూరు జలపాతాన్ని సందర్శించారు. జాతరకు వచ్చే వేలాది మంది భద్రతకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలని చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ వాసంశెట్టి సత్తిబాబు, యాదగిరికి తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్తిబాబు జాతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వాలంటీర్లను రెగ్యులర్ చేయాలి

ప్రభుత్వానికి సిఐటియు వినతి

ప్రజాశక్తి-పాడేరు: గ్రామ సచివాలయ వాలంటీర్లకు తక్షణం సర్వీస్ కండిషన్ రూపొందించి రెగ్యులర్ చేసి కనీస వేతనం చెల్లించాలని సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సచివాలయాల వాలంటీర్లు అధికారాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిందని తెలిపారు. చిత్త శుద్ధి ఉంటే తక్షణం గ్రామ వాలంటీర్లకు సర్వీస్ కండిషన్ రూపొందించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాలంటరీ చేత గొడ్డు చాకిరి చేయించుకుంటుందని, వారి పనికి తగ్గ ప్రతిఫలం దక్కలేదన్నారు. ఇప్పటికి మూడు సంవత్సరాలు సర్వీస్‌లో ఉన్నారని తెలిపారు. ఒకరోజు వాలంటీర్లు విధులు బహిష్కరిస్తే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు పథకాలు ఆగి పోతాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం మారితే వాలంటీర్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణం సర్వీస్ కండిషన్ రూపొందించి కనీస వేతనాలు ఇస్తూ రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

హెల్త్ అసిస్టెంట్ల రెన్యువల్‌కు వినతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఆశ్రమ పాఠశాలలు, జూనియర్ కాలేజి, డిగ్రీ కళాశాల వసతి గృహాల్లో గతంలో పని చేసిన హెల్త్ అసిస్టెంట్లను రెన్యువల్ చేయాలని అరకువేలి ఏటిడబ్ల్యూ కార్యాలయంలో స్థానిక ఏటిడబ్ల్యూ మల్లికార్జున్‌కు హెల్త్ అసిస్టెంట్లు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఆశ్రమ పాఠశాలలు జూనియర్ , డిగ్రీ కళాశాల వసతి గృహంలో 2001 సంవత్సరం నుండి గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ప్రాథమిక వైద్యం అందిస్తున్నామన్నారు. హెల్త్ అసిస్టెంట్ వృత్తిని నమ్ముకుని తమ కుటుంబ జీవనం సాగిస్తూ ఉండేవారమన్నారు. నేటి వరకు హెల్త్ అసిస్టెంట్లకు రెవెన్యూ చేయకపోవడంతో ఒక్కసారిగా కుటుంబ జీవనం ఆందోళనకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక వైద్యం విద్యార్థులకు అందిస్తూ నిత్యం రాత్రి పగలు పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే రెన్యూవల్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. హెల్త్ అసిస్టెంట్లకు బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.హెల్త్ అసిస్టెంట్లు లేక విద్యార్థుల మరణాల సంఖ్య పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి పి.బాలదేవ్, పి.గంగాధర, పి.లలిత, బి.మోనవత్తి, ఎస్.సద్దు, వై.జానకి, టి.బుద్దు, జె నాగమణి, డి.బుజ్జి, వి.నాగేశ్వరావు, సీపీఎం నేత కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

బలిమెల జలాశయం నీటి నిల్వలపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా అధికారులు

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వలు, వినియోగంపై ఒడిశా మల్కనగిరి జిల్లా బలిమెలలో ఆంధ్ర ఒడిశా ఇరు రాష్ట్ర అధికారులు బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బలిమెల జలాశయం నుంచి ఏయే రాష్ట్రాలు ఎంతెంత నీటిని వినియోగించుకున్నారు, జలాశయంలో నీటి నిలువలు ఎన్ని టీఎంసీలు ఉన్నాయి, ఇందులో ఎవరి వాటా ఎంత అనే అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష సమావేశంలో చర్చించారు. దీని ప్రకారం 2021 - 2022 నీటి సంవత్సరంలో ఆంధ్ర ఒడిశా కంటే 5.8765 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకుందని, 2022-2023 నీటి సంవత్సరంలో జూలై నుంచి జనవరి 2023 చివరినాటికి 24.1318 టీఎంసీలుగా నీటిని ఒడిశా వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఇప్పటివరకు ఆంధ్ర వాటా 30.0083 నీటిని వినియోగించుకుందని అధికారులు నిర్ధారించారు. ఒడిశా 2022 - 2023 నీటి సంవత్సరంలో జూలై ఒకటి నుంచి 2023 జనవరి 31 నాటికి 31.5241 నీటిని వినియోగించుకున్నట్టు ఇరు రాష్ట్ర అధికారులు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో 45.2674 టీఎంసీల నీటినిల్వలు ఉన్నట్లు నిర్ధారించారు. దీనిలో ఆంధ్ర వాటాగా 23.3916 టీఎంసీలు, ఒడిశా వాటాగా 21.8758 టీఎంసీలు నీటి నిలువలు ఉన్నట్లు నిర్ధారించారు. ఇరు రాష్ట్ర అధికారులు విద్యుత్ అవసరాలు తాగునీటికి, గోదావరి డెల్టా రబీ పంట అవసరాల నిమిత్తం ఆంధ్ర 4000 క్యూసెక్కులు నీటిని వినియోగించుకోవడానికి, ఒడిశా 1800 క్యూసెక్కులు నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా తరపున ఎస్ఈ సివిల్ కేకేవి. ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్, ఏడిఈ అప్పలనాయుడు, ఒడిశా నుంచి బలిమెల హైడ్రో ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ బిరాంచి నారాయణ సతాపాత్య, డిప్యూటీ జనరల్ మేనేజర్లు కృపా సింధు బిస్వాల్, జ్యోతిర్మయ దాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ త్రిభుల్ల జీనా, నీటిపారుదల శాఖ ఎస్ఇ రమాకాంత పాత్రో, చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ (పొట్టేరు) చంద్రశేఖర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి, వడ్డిగూడెం కాలనీ, సీతంపేట గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై టి దుర్గా ప్రసాద్ బుధవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... రేఖపల్లి గ్రామానికి చెందిన ముగ్గురుపై బంగారు ఆభరణాల దొంగిలించినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఇటీవల శివరాత్రి సందర్భంగా మహిళలు తమ బీరువాలు తీసి ఆభరణాలు చూస్తున్న క్రమంలో అయి కనిపించక పోవడంతో అనుమానం వచ్చిన బాధితులు పోలీస్ శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక ఎస్సై టి దుర్గా ప్రసాద్ తమ సిబ్బందితో దర్యాప్తు చేపట్టగా రేఖపల్లి గ్రామానికి చెందిన కల్లి గంగరాజు, కల్లి రవికుమార్, ముసురు నవీన్ దొంగతనం చేసినట్లు విచారణలో బయట పడింది. వారి వద్ద నుండి అభరణాలు స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేసి రంపచోడవరం కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై టి దుర్గాప్రసాద్ తెలిపారు.

ఘనంగా పేరంటాలమ్మ పండుగ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని లాగరాయి అడ్డురోడ్డు, కొండపల్లి గ్రామాల మధ్య ఉత్తర వాహిని కాలువ ఒడ్డున, ఎత్తైన కొండలు దిగువున అటవీ ప్రాంత సమీపంలో పూర్వీకుల కాలం నుండి ఉన్న గుడి వద్ద బుధవారం లబ్బర్తి, లాగరాయి, కొండపల్లి, సూరంపాలెం, మర్రిపాలెం గ్రామానికి చెందిన ప్రజలు ఘనంగా పండుగ నిర్వహించారు. గిరిజనులు వాగులో పుణ్యసానాలు ఆచరించి పేరంటాలమ్మ, లక్ష్మణ బాబు, శివుడులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ గుడి వద్ద ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పండించి పండించిన తొలిపంటను నైవేద్యంగా పెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం 2000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాగరాయి మాజీ సర్పంచ్ జె తాతారావు, వంతు బాలకృష్ణ, పెద్దలు సోడి సాంబ మూర్తి, తీగల సత్యవతి, పొట్టబోయిన శ్రీను, లోతా చంటమ్మ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రవిబాబుకు ఎమ్మెల్సీ ఇవ్వడంపై హర్షం

ప్రజాశక్తి -సీలేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవి బాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై స్థానిక ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు. సీలేరులో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రవిబాబు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా విధులు చక్కగా నిర్వర్తించి, గిరిజనులకు గణనీయమైన సేవలు అందించారని కొనియాడారు. పార్టీ బలోపేతానికి నిరంతరము కృషి చేశారని తెలిపారు.

వైసిపిని విజయపథంలో నడిపించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల విజయపథంలో నడిపించాలని కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. కొయ్యూరు మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ సమావేశం బుధవారం పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు రూపంలో ప్రజలకు చేసిన మేలును వివరించడంలో విజయవంతం కావాలని సూచించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మేనిఫెస్టోలో ప్రతి అంశం పైనా గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లకు అవగాహన ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వార నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్ బాబు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, వెంకటరమణ, స్థానిక ఎంపీటీసీ మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ జైతి రాజులమ్మ, డైరెక్టర్ అచ్యుత్, మండల అధ్యక్షులు జల్లిబాబులు, నాయకులు సడ్డా సావిత్రి, గాడి నాగమణి, బాడి సుధాకర్, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు రెగటి ముసలి నాయుడు, మాజీ మండల అధ్యక్షులు సుమర్ల సూరిబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


జీవాలను పరీక్షిస్తున్న జూనియర్ వెటర్నరీ అధికారి అన్నపూర్ణ

దారకొండలో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. లంపి వ్యాధి సోకి పశువులు మృత్యువాత గురవుతున్నాయనే ప్రజాశక్తి కథనంతో పశు వైద్య అధికారి రాజశేఖర్ స్పందించి పశువులకు తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా బుధవారం దారకొండలో పశు వైద్య శిబిరం నిర్వహించి గిరిజన రైతులతో జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.అన్నపూర్ణ సమావేశమయ్యారు. పశువులకు, మేకలకు వ్యాధులు ఏ విధంగా వ్యాప్తి చెందుతాయో వివరించారు. లంపి వ్యాధి సోకితే పశువులకు ఏ విధంగా వ్యాప్తి చెందుతుందో, దాని లక్షణాలు గురించి గిరి రైతులకు వివరించారు. పశువులకు ఏ వ్యాధి సోకిన తమకు సమాచారం అందిస్తే వెంటనే వైద్య సేవలు అందిస్తామని సూచించారు. అనంతరం అనారోగ్యంతో ఉన్న పశువులకు, మేకలకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలో సాక్షి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 30 మంది వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసి, పింఛను పేరుతో ప్రతి నెల అందించే రూ.200 చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సాక్షి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి ఆరోగ్య రాజు, ఎల్లవరం పిహెచ్‌సి డాక్టర్ భాస్కర్, సీనియర్ జర్నలిస్టు చోడిశెట్టి సుబ్బారావు, సాక్షి సంస్థ ప్రతినిధి ఎస్తేర్ రాణి, వాలంటీర్స్ మెర్సీ ,శ్యామ్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న సాక్షి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఇక్కడ హామీలే ఇవ్వబడును

- సభ్యుల ప్రశ్నలకు పరిష్కారం లేదు
- ఎన్ఎడిబి సమస్య యథాతథం
- ఇళ్ల పట్టాల అమ్మకంపై ముందుకు సాగని విచారణ
- ఎన్నికల నిబంధనల మధ్య నేడు జెడ్‌పి సమావేశం



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు, అధికారులిచ్చిన సమాధానాలు, హామీలు ఆ సమావేశానికి పరిమితమవుతున్నాయి. తదుపరి సర్వసభ్య సమావేశంలో ఆ సమస్యలకు పరిష్కారం లభించడంలేదు. సభ్యులను సంతృప్తిపరచేందుకు సమావేశంలో అధికారులు సమాధానమిస్తున్నా, ప్రభుత్వ విధానాలతో ముడిపడిన అంశాలపై కొనసాగింపు ఉండడంలేదు. గతేడాది నవంబరు 26న జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అనేక ప్రశ్నలు, సమస్యలు లేవనెత్తారు. వీటిపై సంబంధిత అధికారులు సమయస్ఫూర్తితో సమాధానమిచ్చారు. తప్ప మూడు నెలల్లో జరిగిన పురోగతి కానరావడంలేదు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో మునుపటి సమావేశాల్లో జరిగిన చర్చ కూడా ఈసారి జరిగేలేదు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనల నేపథ్యంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలకు కొత్తగా ఎటువంటి హామీలు ఇవ్వడానికి అవకాశంలేదు. అయితే గత సమావేశంలో ప్రభుత్వ యంత్రాంగం వివిధ సమస్యలపై స్పందించి ఇచ్చిన హామీలపై సభ్యులు అడగనున్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్ల పట్టాల అమ్మకంపై విచారణ జరిపి, అమ్మకపు పట్టాలను రద్దుచేసి, అర్హులకు ఇవ్వాలని సభ్యుల సూచనపై విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్ స్పందిస్తూ ఇళ్ల పట్టాల అమ్మకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల పట్టాల అమ్మకంపై విచారణ ఎంతవరకు వచ్చిందో, అనర్హుల పట్టాలు ఎన్ని రద్దు చేశారన్న విషయం రహస్యంగానే ఉంది. ఇళ్ల పట్టాలను వేలాది మంది అనర్హులకు మంజూరుచేశారు. అనర్హుల్లో కొందరు తమ పట్టాలను అమ్మకానికి పెట్టిన వ్యవహారం వెలుగులోకి రావడంతో, పట్టాల అమ్మకంపై విచారణ జరిపి, అమ్మకపు పట్టాలను రద్దుచేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. పట్టాలు అమ్ముకున్నవారి ఇళ్ల పట్టాలు రద్దుచేసి అర్హులైన వారికి ఇవ్వాలని జెసికి ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ సూచించారు. అనర్హుల్లో అధికంగా అధికార పార్టీకి చెందినవారు కావడంతో పట్టాల అమ్మకంపై విచారణ మాటలకే పరిమితమైంది.

పాఠశాలల పరిశీలనకు ఏజెన్సీలో ప్రధానోపాధ్యాయులు చెబుతున్న అభ్యంతరాలను జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పందిస్తూ పాఠశాలల పరిశీలనకు అభ్యంతరం చెబుతున్న ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. ఈ సమస్య పునరావృతం కాకుండా చూడాలని మంత్రి చెప్పినా అదే సమస్య కొనసాగుతోంది. ఎన్ఎడిబి నిర్వాసితుల సమస్యలపై రాష్ట్రస్థాయి అధికారిని నియమిస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పారని మంత్రి తెలిపారు. నిర్వాసితుల సమస్యలు అలానే ఉన్నాయి. అనంతగిరి మండలంలో రోడ్డు నిర్మించకుండా నిర్మించినట్లు చూపించి రూ.8కోట్లు స్వాహా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, డబ్బులు తిరిగి రాబట్టాలని జెడ్‌పిటిసి గంగరాజు ప్రస్తావించినా, దుర్వినియోగమైన నిధులు రాబట్టే ప్రయత్నం లేదు.

కోరెడ్ల రమాప్రభ గెలుపునకు ప్రచారం



రాంబిల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాంబిల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్, 250 ప్రజా సంఘాలు బలపర్చిన కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రం రాంబిల్లి పంచాయతీలో ప్రజాసంఘాల నాయకులు బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.నారాయణరావు, సిహెచ్.శివాజీలు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడుతున్న రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చోడిపల్లి గంగరాజు, డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్.నూకన్న, సిఐటియు నాయకులు డి.కాకియ్య తదితరులు పాల్గొన్నారు.



రొంగలినాయుడుపాలెం, గొండుపాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

కె.కోటపాడు : పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేముడు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రొంగలినాయుడుపాలెం, గొండుపాలెం గ్రామాలలో బుధవారం ప్రజా సంఘాల నాయకులు ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. ప్రజా సమస్యలపై గొంతెత్తే రమాప్రభను శాసన మండలికి పంపించాలని కోరారు.

డుంబ్రిగూడ: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ స్థానిక మండల కేంద్రంలో సిఐటియు, గిరిజన సంఘం నాయకులు బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలతో పాటు కార్మిక కర్షకుల కోసం పిడిఎఫ్ అభ్యర్థులు శాసనమండలిలో గళ మెత్తుతున్నారన్నారు. రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో ప్రచారం చేస్తున్న సిఐటియు, గిరిజన సంఘం నాయకులు

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఆన్‌లైన్ కోర్సుల ప్రవేశాలకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు జి.ధర్మారావు తెలిపారు. విశ్వ విద్యాలయం అందిస్తోన్న అన్ని సర్టిఫికెట్, డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలకు అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందాలని వివరించారు. ఇగ్నో వెబ్‌సైట్ https://ignouadmission.samarth.edu.in ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలు పొందే వీలుందని పేర్కొన్నారు. ఫీజులు ఆన్‌లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుందని వివరించారు. ఎంపిక చేసిన డిగ్రీ కోర్సులలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీకూడా విశ్వవిద్యాలయం కల్పిస్తోందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ చూడవచ్చని, లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈమెయిలు ద్వారా సంప్రదించాలని సూచించారు.

నలుగురిలో ఒకరికి అధిక రక్తపోటు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతీయులు ప్రతి నలుగురిలో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని ప్రజారోగ్య నిపుణులు తెలిపారు. ఇటీవల ముగిసిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ కాన్ఫరెన్స్ గోల్డెన్ జూబ్లీ వేడుకలో వైద్యులు, ఉన్నత ప్రజారోగ్య నిపుణులు అనియంత్రిత రక్తపోటు ప్రమాదాలను ఎదుర్కోవడానికి వేగవంతమైన చర్య కోసం ఒక స్పష్టమైన పిలుపును ఇచ్చారని తెలిపారు. చికిత్స చేయకుండా వదిలేస్తే ఆకస్మిక, అకాల మరణాలకు దారితీసే అత్యంత ప్రమాద కారకంగా దీనిని పేర్కొన్నారు. వైద్య సమాజం, సీనియర్ ప్రభుత్వ అధికారులు, పౌర సమాజం ఉమ్మడిగా ఒక కార్యాచరణ ప్రణాళికను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సహకారంతో బీబీనగర్ లోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్ (ఎయిమ్స్) మూడు రోజుల వార్షిక సదస్సును నిర్వహించినట్లు ప్రజారోగ్య నిపుణులు తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించిన సెమినార్లు, ప్యానెల్ చర్చల్లో నాన్-కమ్యూనికేబుల్ వ్యాధులు, అందుకు దారితీసే వివిధ ప్రమాద కారకాలను మొదటి ప్రాధాన్యత కలిగిన ప్రాథమిక ఆందోళనగా గుర్తించాయని పేర్కొన్నారు. 'ఇనస్పెక్షన్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ హెల్త్: వన్ హెల్త్ వన్ ప్లానెట్', నేపథ్యంతో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ యొక్క 50వ వసంతం సందర్భంగా, క్రియాశీలకంగా ఉంటూ మంచి భవిష్యత్తు కలిగిన ప్రజారోగ్య వ్యూహం కోసం భాగస్వామ్యులందరూ ఒకే చోటకు చేరి ఒక ప్రణాళికను రూపొందించడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. అవగాహన లేక, చికిత్స పొందని కారణంగా రక్తపోటుపై బహుళ రంగాల చర్చపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.

24 నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి-విశాఖపట్నం : పెదవాల్తేరు రోడ్డులోని ఆంధ్ర విశ్వవిద్యాలయ మైదానంలో అ నెల 24 నుంచి మార్చి 9వ తేదీ వరకు చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించనున్నట్లు చేనేత, జౌళి శాఖ అధికారి ఆర్‌వి.మురళీకృష్ణ తెలిపారు.

శిశు మరణాలను నియంత్రించాలి

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో శిశు మరణాల నియంత్రణకు సచివాలయాల సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి మండల అధికారులు, సచివాలయాల సిబ్బందితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలకు వ్యాక్సినేషన్ క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని, 50 శాతం పిల్లలు ఇందుకు దూరం అవుతున్నట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. తల్లిపాలపై అవగాహన లేకపోవంతో ఇతర కారణాల వల్ల శిశు మరణాలు జరుగుతున్నాయన్నారు. గ్రామ పరిధిలో ఆశ, ఎఎన్ఎం, అంగన్వాడి, మహిళా పోలీస్, తదితర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ శిశు మరణాలు సంభవించడం బాధాకరమన్నారు. జిల్లాలో ఏటా 20 వేల ప్రసవాలు జరిగితే 500 పైగా పిల్లలు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. పేద గిరిజనులకు అవగాహన అవగాహన కల్పించి చైతన్య పరచాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది తీసుకోవాలన్నారు. గ్రామంలో నెలకు ఆరేడు మించి ప్రసవాలుండవని వారిని ట్రాక్ చేసి తల్లి పాల పై అవగాహన కల్పించడంతో పాటు ఇమ్మ్యూనైజేషన్ ప్రకారం వ్యాక్సిన్ తీసుకునేలా చూడాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రతి సచివాలయంలో బిడ్డ జనన తేదీ, తల్లి, తండ్రి పేరు, మొబైల్ నంబరు, హై రిస్క్ గర్భిణీలకు సంబంధించి హై రిస్క్ కారణం, భర్త లేదా బంధువుల మొబైల్ నంబర్, డెలివరీ అంచనా తేది, అంబులెన్స్ డ్రైవర్ మొబైల్ నంబరు మొదలగు వివరాలతో హై రిస్క్ గర్భిణీల వివరాల రిజిస్టర్ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వీటిని ఎంపిడిఓలు పర్యవేక్షించాలని ఆదేశించారు. సచివాలయ సందర్శనలో కూడా సంబంధిత రిజిస్టర్లు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. రిజిస్టర్లు నమోదు చేయకపోయినా, గర్భిణీలను సందర్శించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పాఠశాల, వసతి గృహాలలో డ్రాపవుట్ల వివరాలు, తాగునీటి ట్యాంకులు, క్లీనింగ్, బ్లీచింగ్ వివరాలతో కూడిన రిజిస్టర్లు కుడా నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయాల ద్వారా కేవలం సేవలు అందించటమే కాదని, గ్రామాభివృద్ధి జరగాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, ఎంపిడిఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు బాధ్యత డిడిఓలదే

పాడేరు: ప్రభుత్వ ఉద్యోగుల ఏ.పి.ఎఫ్.ఆర్.ఎస్. (ముఖ గుర్తింపు వ్యవస్థ) ముఖ ఆధారిత హాజరు బాధ్యత డిడిఓలదేనని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. ఏ.పి.ఎఫ్.ఆర్.ఎస్. అమలు తీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సాధారణ పరిపాలన అధికారి ముత్యాలరాజు, సి.ఎఫ్.ఎమ్.ఎస్. అధికారి సునీల్ రెడ్డి బుధవారం వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు.

ఈ మేరకు అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందిస్తూ, జిల్లాలోని అనేక సచివాలయాలలో ఇంటర్నెట్ కనెక్టివిటీ లేనందున ఎఫ్.ఆర్.ఎస్. నమోదు త్వరితగతిన కాలేదని చెప్పారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్షిస్తూ, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఉద్యోగి ఎఫ్.ఆర్.ఎస్. నమోదు కావాల్సిందేనని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 70 శాతం మాత్రమె ఎఫ్.ఆర్.ఎస్. నమోదు అయినందున మిగిలిన వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి పి అంబేద్కర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

హృద్రోగ చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న ఒఎస్‌జి సంస్థ ప్రతినిధి

ప్రజాశక్తి -ఆనందపురం : హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారి వైద్యానికి మండలంలోని బోయపాలేనికి చెందిన ఒఎస్‌జి ఫౌండేషన్ సంస్థ దాతల ద్వారా సమకూర్చిన రూ.25వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబీకులకు బుధవారం అందజేశారు.స. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం గొనప పుట్టుగ గ్రామానికి చెందిన లండ సంతోషి అనే మూడేళ్ల బాలిక గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ, స్టార్ పినాకిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాలిక గుండె ఆపరేషన్‌కు రూ.ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు నిర్ధారించిన నేపథ్యంలో నిరుపేద కుటుంబానికి చెందిన బాలిక తల్లిదండ్రులు తమ బిడ్డ వైద్యానికి సాయం చేయాలని పలు స్వచ్ఛందసంస్థలు, దాతలను సోషల్‌మీడియా ద్వారా అభ్యర్థించారు. బాలిక తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి, నిస్సహాయతపై ఒఎస్‌జి ఫౌండేషన్ కూడా స్పందించి, దాతల ద్వారా విరాళాలను సేకరించి, వచ్చిన మొత్తం రూ.25వేలను బుధవారం ఆసుపత్రిలో బాలిక తల్లిదండ్రులకు అందజేశారు. మరికొంతమంది దాతలు కూడా సాయం చేశారని ఒఎస్‌జి సంస్థ ప్రతినిధి శివ దళాయి తెలిపారు. బాలికకు ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారని, మొదటి ప్రయత్నంలో ఆపరేషన్ ఫెయిలైనప్పటికీ, రెండో ప్రయత్నంలో మళ్ళ ఆపరేషన్ చేశారని, ప్రస్తుతం పాప ఐసియులో ఉన్న చిన్నారికి ప్రాణాపాయం తప్పి కోలుకుంటోందని వైద్యులు చెప్పారనిశివ తెలిపారు. మెరుగైన వైద్యం, కోలుకునేందుకు మరికొంత సమయం పట్టనున్న నేపథ్యంలో బాధిత కుటుంబానికి దాతలు చోదోడుగా నిలవాలని శివ కోరారు.

భెల్ త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికల్లో

సిఐటియు ప్యానల్‌ను గెలిపించాలి



పోటీలో ఉన్న సిఐటియు ప్యానల్ అభ్యర్థులు వీరే

ప్రజాశక్తి -గాజువాక : భెల్‌లో ఈనెల 23న జరగనున్న త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికల్లో సిఐటియు ప్యానల్‌ను గెలిపించాలని, బిహెచ్ఇఎల్ సిఐటియు ప్రధానకార్యదర్శి జిటిపి ప్రకాష్ కోరారు. బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిఐటియు ప్యానెల్‌లో తనతోపాటు కె.విజయ్‌కుమార్, ఎస్.అప్పారావు, కె.నారపరెడ్డి, జి.రాంబాబు, పి కనకారావు, పి శివరాం, బి కృష్ణమూర్తి అభ్యర్థులుగా పోటీలో ఉన్నారన్నారు.

త్రిఫ్ట్ సొసైటీలో సిఐటియు ప్యానెల్ విజయం సాధిస్తే సభ్యులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతోపాటు దాచుకున్న డబ్బుపై ప్రస్తుతమున్న దానికంటే అధిక వడ్డీతోపాటు, సభ్యులు తీసుకున్న రుణాలు, డిపాజిట్లుపై వడ్డీ తేడా ఒకశాతం మాత్రమే ఉండేలా చర్యలు చేపడతామన్నారు. సభ్యులకు బీమా సౌకర్యం కల్పిస్తామని, సొసైటీని లాభాల బాటలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సహకార స్ఫూర్తితో సభ్యులకు అత్యవసర రుణాలు మంజూరు. హెచ్‌పిఇపిలోని 700మందిలో500మంది మాత్రమే సభ్యులుగా ఉండగా, కార్మికులందరికీ సభ్యత్వం కల్పిస్తామన్నారు.సమర్థులైన సిఐటియు ప్యానెల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

ఆస్ట్రేలియన్ వర్సిటీల్లో భారతీయ విద్యార్థులకు ప్రాధాన్యత

'గీతం'లో ఆస్ట్రేలియన్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో ట్రేడ్ కమిషనర్ మోనికా కెనడీ

ప్రజాశక్తి- మధురవాడ : భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య మెరుగైన వాణిజ్య సంబంధాలు ఉన్నాయని ఆస్ట్రేలియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ మోనికా కెనడీ అన్నారు. తమ దేశంలోని విశ్వవిద్యాలయాలలో భారతీయ విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోఆస్ట్రేలియాలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యావకాశాలపై ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆస్ట్రేలియన్ ట్రేడ్ కమిషనర్ మోనికా కెనడీ ముందుగా గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్‌తో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా గీతం అధ్యక్షుడు.శ్రీభరత్ మాట్లాడుతూ ప్రపంచశ్రేణి విద్యాలయంగా గీతంను తీర్చిదిద్దడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను వివరించారు. గీతంలో బోధన, పరిశోధన, కోర్సుల వివరాలను వెల్లడించారు. గీతం విద్యార్థుల ఉన్నతికి దోహదపడే అన్ని విద్యాసంస్థలతో మేథో సంబంధాలకు ఆసక్తితో ఉన్నామన్నారు గీతం కెరీర్ సర్వీసెస్ అసోసియేట్ డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ మాట్లాడుతూ గీతం విద్యార్థుల ఉద్యోగ,ఉపాధి అవకాశాలతోపాటు విదేశీ విద్యాలయాలలో ఉన్నత విద్యావకాశాలపై అవగాహనకు ఇటువంటి ఎడ్యుకేషన్ ఫెయిర్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, టాస్మేనియా, జేమ్స్‌కుక్, యూనివర్సిటీ ఆఫ్ ఆస్ట్రేలియా, డెంకిన్ యూనివర్సిటీ, ఫ్లిండర్స్ యూనివర్సిటీ, మాక్వారి యూనివర్సిటీ, బాండ్ యూనివర్సిటీ, మోనాష్ యూనివర్సిటీ, యుటిఎస్ యూనివర్సిటీ వంట ిప్రముఖ వర్సిటీల ప్రతినిధులు తాముం అందించేవివిధ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియన్ ట్రేడ్ కమిషనర్ మోనికా కెనడీ, సంతోష్ కర్ణానందలను గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ సన్మానించారు. సిఎ.శ్రీరామ్, డాక్టర్ బి.రవికాంత్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియన్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించారు.



ఆస్ట్రేలియన్ ట్రేడ్ కమిషనర్‌ను సత్కరిస్తున్న గీతం అధ్యక్షుడు

మద్యం దుకాణం వద్దు..!

ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న రామకృష్ణాపురం మహిళలు



మద్యం షాపును ప్రారంభించకుండా అడ్డుకున్న స్థానికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు, కేంద్రకారాగారం ఎదురుగా రామక్రిష్ణాపురంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ మద్యం దుకాణం ప్రారంభాన్ని స్థానికులు అడ్డుకున్నారు. విశాఖ కేంద్రకారాగారం ఎదురుగా రామక్రిష్ణాపురంలో బిఆర్‌టిఎస్ రోడ్డును ఆనుకొని ఉన్న ఓ వ్యక్తికి చెందిన రేకుల షెడ్డులో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం మద్యం స్టాక్‌ను తీసుకు వచ్చి షెడ్డులో పెట్టారు. స్థానికులు ఈ విషయం గమనించి అక్కడ ఉన్న ఎక్సైజ్ అధికారులను అడిగారు. అక్కడ మద్యం షాపు ప్రారంభిస్తున్నట్టు తెలియడంతో జనావాసాల మధ్యం మద్యం దుకాణం వద్దంటూ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులకు, స్థానిక మహిళలకు కొంతసేపు వాగ్వివాదం జరిగింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని మహిళలు అడ్డు తగిలారు. దశల వారిగా మద్యాన్ని నిషేధిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం, ఇలా కాలనీకొక మద్యం దుకాణం ఏర్పాటుతో విస్తరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. దీంతో అధికారులు షాపు షట్టర్ మూసేసి వెనుతిరిగారు.

మనస్తత్వాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థుల మనస్తత్వాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని ఇఎండిపి జిల్లా మేనేజర్ కాకర నరేష్ సూచించారు బుధవారం స్థానిక ఎపి బాలికల గురుకులంలో ఎస్ఇఆర్‌టి, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు సృజనాత్మక నైపుణ్యంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని సూచించారు. ఫెసిలిటేటర్ వి.సాయిలక్ష్మి 18వ సెషన్‌లో 'సమస్య పరిష్కార పరిశోధన' అంశంపై విద్యార్థులకు బోధించారు.గురుకులం ప్రిన్సిపాల్ కె రాంబాబు ప్రోగ్రాం ముఖ్యోద్దేశ్యం, వచ్చే నెలలో జరుగనున్న ప్రాజెక్ట్ ఎక్స్‌పో గురించి వివరించారు

ముగిసిన పశువైద్యాధికారుల శిక్షణ

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్ర పశుగణ వ్యవస్థాపకత యాజమాన్య సంస్థ(స్మయిల్) ఆధ్వర్యంలో పాడి పశువుల్లో ఉత్పాదకత పెంపు, పశు వైద్యుల పాత్ర అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. సంస్థ అదనపు సంచాలకులు డాక్టర్ వై.సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 33 మంది పశు వైద్యులు పాల్గొన్నారు. పాడి పశువుల్లో ఆధునిక పోషణ పద్ధతులు, మేలు రకాలైన పశువుల ఉత్పత్తి, వివిధ రుతువుల్లో పాడి పశువుల యాజమాన్యం, ఆధునిక పద్ధతిలో గొర్రెల, మేకల పోషణ, గ్రామీణ కోళ్ళ పెంపకం, రైతుల ఆదాయం రెట్టింపు చేసే పద్ధతులు, పాల ఉత్పత్తులు, వ్యక్తిత్వ వికాసం తదితర విషయాలపై డాక్టర్ మురళీధర్, చక్రవర్తి, రమణయ్య, సుధాకర్, మాదిన ప్రసాదరావు, చంద్రశేఖర్, చలపతి, సతీష్‌కుమార్‌లు పశువైద్యులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా స్మయిల్ అదనపు సంచాలకులు డాక్టర్ వై.సింహాచలం మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ సంస్థ స్థాపించినప్పటి నుంచి నిర్వహించిన కార్యక్రమాలను, సాధించిన విజయాలను వివరించారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నర్సింగరావు సత్తా

ప్రజాశక్తి-ఉక్కునగరం : హరియాణాలో జరిగిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో అగనంపూడికి చెందిన స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుడు చట్టి నర్సింగరావు 4X100 మీటర్ల పరుగు పందెంలో సత్తాచాటి రెండోస్థానంలో నిలిచాడు. గతంలోనూ జిల్లా. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీలలో నర్సింగరావు తన ప్రతిభను నిరూపించుకుని పతకాలను సాధించడంతోపాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. హరియాణాలో ఈనెల 18న జరిగిన పోటీల్లోనూ రాణించి, రెండోస్థానంలో నిలవడం ద్వారా రజత పతకాన్ని కైవసం చేసుకోవడంతోపాటు జాతీయస్థాయిలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పేరును నిలబెట్టగలిగాడు. 28 రాష్ట్రాల క్రీడాకారులతో పోటీపడి, పతకాన్ని సాధించడంపై పలువురు నర్సింగరావును ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

ప్రజాశక్తి -పిఎం పాలెం : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమౌతున్న చంద్రంపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు విజ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోజూ సాయంత్రం అల్పాహారాన్ని అందజేస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదున్నర గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సమయంలో సాయంత్రం వేళ విద్యార్థులు ఆకలి, అలసటతో ఇబ్బందులు పడకుండా వుండేందుకు తమ వంతుసాయంగా ప్రత్యేక తరగతులు నిర్వహించే 25రోజులపాటు రోజూ సాయంత్రం రోజుకొక రకమైన అల్పాహారాన్ని విద్యార్థులందరికీ అందజేస్తామని విజ్డిస్ ఫౌండేషన్ సంస్థ అధినేత తలశిల విజయ్‌మోహన్, ఆయన సతీమణి విజయలక్ష్మి తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎం రాజబాబు, ఎ.జయప్రద, విద్యార్థుల కమిటి ఛైర్మన్ బుడుమూరు మీనా, కో ఆప్షన్ సభ్యులు పిల్లా సూరిబాబు, కింజరాపు భరత్ పాల్గొన్నారు.

మినీ ట్రావెల్ బస్సు దగ్ధం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ, శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారి పక్కన నిలిచి ఉన్న మినీ ట్రావెల్ బస్సు బుధవారం మధ్యాహ్నం దగ్ధమైంది. ప్రధాన రహదారి పక్కన చాలా రోజుల క్రితం నుంచి నిలిపి ఉన్న బస్సు నుంచి ఒక్కసారిగా పెద్ద ఎత్తున పొగతో కూడిన మంటలు చెలరేగాయి. దీనితో స్థానికులు, అటు వైపు ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఎగసి పడుతున్న మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీస్తున్నారు.

కుల వృత్తుల పూర్వవైభవానికి కృషి

ప్రజాశక్తి ములగాడ : కనుమరుగవుతున్న కులవృత్తులకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చి, వారిని ఆర్థికంగా ఆదుకుని, అభివృద్ధి చెందేలాచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని విశాఖ నగర మాజీ డిప్యూటీ మేయర్, అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ అన్నారు. బుధవారం పద్మనాభ మండలం ఇసుకల పాలెంలో తెలుకుల కులవృత్తి అయిన నువ్వుల నూనె తయారీ నల్ల నువ్వుల నుండి తెల్ల నువ్వుల పప్పు తయారీ మరియు నువ్వుల పప్పు నుండి నువ్వుల పప్పు, నూనె తయారీ యూనిట్‌ను ప్రారంభించారు, మిషనరీ మోటార్లను ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మన్ కల్లేపల్లి కూర్మనాథ్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుల వృత్తిదారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు పిఎంఇజిపి పథకం ద్వారా రూ.పది లక్షల నుండి రూ. పాతిక లక్షల వరకు బ్యాంకు రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు, కులవృత్తుల పరిపుష్టికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూరుస్తున్నామన్నారు. సంఘం సిటీ ప్రధాన కార్యదర్శి జామి అప్పలరాజు, పద్మనాభం మండల ప్రధాన కార్యదర్శి అలమండ అప్పారావు పాల్గొన్నారు.

2 నుంచి అనంతుని కల్యాణోత్సవం

పజశక్తి- పద్మనాభం: మండల కేంద్రమైన పద్మనాభం గ్రామంలో వెలసిన అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవ పోస్టర్‌ను బుధవారం కుంతీ మాధవస్వామి ఆలయంలో స్థానిక ఎంపిపి కె.రాంబాబు ఆవిష్కరించారు వచ్చేనెల రెండు నుంచి ఎనిమిదో తేదీ వరకు అనంతుని కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఉత్సవ కమిటీలను ఎంపిపి కోరారు.కల్యాణోత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.